క్లుప్తంగా

చెస్ టోర్నీలో విద్యార్థి ప్రతిభ


ట్రోఫీతో విద్యార్థి నవ్య

నగరి: మండలంలోని ముడిపల్లె జెడ్పీ హైస్కూలు విద్యార్థి ఎం.నవ్య చదరంగం పోటీలలో ప్రతిభ చాటింది. చెన్నై నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫైడ్ రేపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొన్న దివ్య అండర్–15 విభాగంలో 8వ స్థానం కైవసం చేసుకుంది. ఆ విద్యార్థిని, కోచ్ ఆనందమోహన్‌ను, పీడీ వెంకటేశ్వర్లును స్కూలు ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

వినతుల పరిష్కారానికి కృషి

శ్రీరంగరాజపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందే వినతులపై ప్రత్యేకశ్రద్ధ వహించి పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై సిబ్బందిని ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 18 వినతులు స్వీకరించారు. వీటిలో మ్యుటేషన్ 2, దారి సమస్య 4, రేషన్ కార్డులు 3, ఆన్‌లైన్ అడంగల్ 3, పొజిషన్ సర్టిఫికెట్ 2, బర్త్ సర్టిఫికెట్ కోసం 4 చొప్పున వినతులు అందినట్లు ఆయన చెప్పారు. రెవెన్యూ సిబ్బంది, అర్జీ దారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు


కార్మికుల వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కమిషనర్

నగరి: స్వచ్ఛతా హి–సేవ సఫాయి మిత్ర సురక్ష సివిర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పుదుపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సత్రవాడ, పుదుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల మెడికలాఫీసర్లు ఎయిల్ అరసన్, బిందు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, పురపాలక, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లల వైద్య శిబిరానికి స్పందన

గంగాధర నెల్లూరు: దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని సోమవారం మండల కేంద్రంలో జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ మద్దిపట్ల వెంకటరమణ ప్రారంభించారు, అలిమ్కో డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. అర్హులైన దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వ పరంగా అవసరమైన పరికరాలు ఇస్తామన్నారు. శిబిరానికి 70మంది పిల్లలు తమ తల్లిదండ్రులతో హాజరయ్యారు. ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డి, పెనుమూరు, పాలసముద్రం ఎంఈఓలు భాస్కర్ నాయుడు, గిరిజ, సహితవిద్య సమన్వయకర్త జగ్గు మధు, ఆరు మండలాల స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఐఎఫ్ఆర్ఎస్, భవిత సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన


మాట్లాడుతున్న పీఏసీఎస్ అధ్యక్షుడు

నగరి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం రైతులకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యక్షులు బాలాజి సంఘంలో అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. గతంలో తీసుకున్న ఎల్‌టీ లోన్లు, ఎస్టీ లోన్లు త్వరగా చెల్లిస్తే అధిక మొత్తంలో రుణాలు పొందవచ్చన్నారు. సీఈఓ తులసిపిళ్లై మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల తరహాలేనే సంఘంలో కూడా సేవింగ్ డిపాజిట్లు ప్రారంభించి లావాదేవీలు నిర్వర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఆనంద్ పాల్గొన్నారు.

27 నుంచి వేపంజేరిలో బ్రహ్మోత్సవాలు

గంగాధర నెల్లూరు: మండలంలో వేపంజేరిలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ, అడ్వొకేట్ కేఎస్ .వాసు, ఆలయ మేనేజర్ వెంకటేశులు రెడ్డి తెలిపారు. 27న అంకురార్పణ, 28 న ధ్వజారోహణం, శేష వాహనం, సింహవాహనం, 29న మోహినీ అవతారం, కళ్యాణోత్సవం, గరుడ సేవ, 30న హనుమంత వాహనం, గజవాహనం,అక్టోబర్ 1న రథోత్సవం, అశ్వ వాహనసేవలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు. 2 చక్రస్నానం, ద్వాదర్శనం, ధ్వజారోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని, ఉత్సవాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేస్తామన్నారు.

బాలత్రిపురా సుందరిగా దేశమ్మ దేవత



శ్రీశైలపుత్రి అలంకరణలో అన్నపూర్ణ దేవి



ప్రత్యేక అలంకరణలో కరుమారియమ్మ



ఆదిపరాశక్తి అలంకరణలో ద్రౌపదీదేవి



అమ్మ అనుగ్రహించే వేళ..!

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో దుర్గాదేవి అమ్మవారి ఆలయాలు కళకళలాడుతున్నాయి. ఇప్పటికే ఆలయాలు, పరిసర ప్రాంతాలు ఇప్పటికే సుందరంగా ముస్తాబై విద్యుద్దీపాలతో సరికొత్త శోభను సంతరించుకున్నాయి.

- ప్రారంభమైన దసరా ఉత్సవాలు
- కళకళలాడిన అమ్మవారి ఆలయాలు

నగరి: ఉత్సవాలు పురస్కరించుకుని వివిధ ఆలయాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తొలిరోజు నేత్రప్రదాయిని దేశమ్మ దేవాలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణదేవి, 25న లలితా త్రిపుర సుందరి, 26న శ్రీమహాలక్ష్మి. 27న సరస్వతీ దేవి, 28న దుర్గాదేవి, 29న మహిషాసురమర్దిని, 30న రాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయంలో అమ్మవారికి అన్నపూర్ణదేవి అలంకారం చేశారు. 23న శ్రీ బ్రహ్మచారిణీ అలంకరణ, ఈ నెల 24 శ్రీచంద్రగంట , 25న శ్రీకూష్మాండదుర్గ, 26న శ్రీస్కంధమాత, 27న కాత్యాయిని, శ్రీ కళారాత్రి, 30న శ్రీ అన్నపూర్ణదేవి, అక్టోబర్ 1న సిద్ధిరాత్రి అలంకరణ, 2న శ్రీకలశాభిషేకం నిర్వహించనున్నారు. నగరిలోని కరకంతేశ్వర స్వామి ఆలయంలోని కామాక్షీదేవి సన్నిధి, వాసవీ కన్నకాపరమేశ్వరి ఆలయం, నెత్తం కండ్రిగలోని కరుమారియమ్మ ఆలయాలు నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఓంశక్తి ఆలయంలో మంగళవారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజూ ఆలయం వద్ద అన్నదానం చేస్తామన్నారు.


స్వగృహంలో దసరా పూజల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ గ్రామ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురాసుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు.

స్వగృహంలో మాజీ మంత్రి ఆర్కేరోజా పూజలు

మాజీ మంత్రి ఆర్కేరోజా దసరా ఉత్సవాలను పురస్కరించుకొని తన స్వగృహంలో అమ్మవారి ప్రతిమకు అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు.

నింద్ర మండలంలో..

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలోని శ్రీ మహాలక్ష్మి ఆలయంలో దేవీ నవరాత్రులఉత్సవాలు సోమవారం ఘనంగా మొదలయ్యాయి. అమ్మవారికి విశేష పూజలు గోపూజలు చేశారు. సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం, అంకురార్పణ, అఖండ దీపారాధన, నవగ్రహ మండపారాధన..ఇత్యాది కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.




నింద్ర: కేఆర్ పాళెంలో దేవీ నవరాత్రి పూజలు, ద్రౌపదీదేవి ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

పుత్తూరులో..

పుత్తూరు: పట్టణంలోని ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లోని అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. తొలుత అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ద్రౌపదీదేవిని జగన్మాత ఆదిపరాశక్తిగా పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి కొలువు దీర్చారు. ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఇక, శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో కామాక్షీ దేవిని చాముండేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం పట్టణ పురవీధుల్లో అమ్మవారు విహరించారు. పట్టణంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వడమాలపేటలో..

వడమాలపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు లలితా సహస్ర నామార్చన, కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని దీక్ష బంధన అలంకరణలో కొలువు దీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

ఏళ్లకాలంగా సాగుచేస్తున్నాం.. పట్టాలివ్వండి

- తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్టీల ధర్నా
- సాగు భూముల పక్కన క్వారీకి అనుమతులివ్వరాదని వినతి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్టీలు

నగరి: "కొండలు, గుట్టల పక్కన ఏళ్లకాలంగా బీడు భూములు సాగుచేసుకుంటూ జీవిస్తున్నాం.. మాకు వేరే జీవనాధారం లేదు..మేము సాగుచేసే భూములకు పట్టాలు ఇవ్వండి" అని డిమాండ్ చేస్తూ తడుకుపేట, ముడిపల్లె ఎస్టీ కాలనీకి వాసులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఆందోళన చేశారు. దీనికి జెడ్పీటీసీ సభ్యుడు సభ్యుడు గాంధీ, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి గోవిందస్వామి నేతృత్వం వహించారు. ఎస్టీలు మాట్లాడుతూ, తాము చలపరకోన కొండగుట్టల నడుమ సర్వే నంబర్ 245లోని గుట్టల్లో 20 ఏళ్లుగా శ్రమలకోర్చి సాగు చేసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం మామిడి చెట్లు ఉన్నాయని, సుమారు 30 కుటుంబాలు ఆ స్థలంలోనే కాపురాలు ఉంటున్నాయన్నారు. పలుమార్లు పట్టాల కోసం అధికారులను సంప్రదించినా స్పందించడం లేదని, అయితే ప్రస్తుతం ఇదే సర్వే నంబర్‌లోని గుట్టలను రాజకీయ పలుకుబడి ఉన్న నేతలకు క్వారీ నిమిత్తం వేగంగా అనుమతి ఇచ్చారని విమర్శించారు. ఆ ప్రాంతంలో క్వారీ ఏర్పాటు చేస్తే తమ భూములున్న ప్రాంతానికి వెళ్లేందుకు దారికూడా ఉండదని, పంటలు నాశనమవడంతో పాటు పశువులకు మేత కరువవుతుందని, అంతేకాకుండా అక్కడ నివాసాలున్న వారు ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాము సాగుచేసే భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని, తమ భూములున్న ప్రాంతంలో క్వారీలకు అనుమతివ్వరాదని తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ, క్వారీ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, పట్టాలు కావలసిన వారు సంబంధిత సచివాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలని ధర్నా



ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు


వెదురుకుప్పం: తహసీల్దార్ బాబుకు వినతి పత్రం ఇస్తున్న గీత, ఆశా వర్కర్లు

- తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆశావర్కర్ల ఆందోళన


విజయపురం/వెదురుకుప్పం: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం విజయపురం, నింద్ర, వెదురుప్పం తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆశావర్కర్లు ధర్నా చేశారు. విజయపురంలో ధర్నాకు నేతృత్వం వహించి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, వెదురుకుప్పంలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గీత మాట్లాడారు. ఆశావర్కర్లకు జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలి డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, గర్భిణులు, దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న వారికి వైద్యసేవలు అందివ్వడంలో తాము క్రియాశీలకంగా పనిచేస్తున్నా ప్రభుత్వం తగిన గుర్తింపునివ్వడం లేదని, తమ సమస్యలపై పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని నిరసన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక జీతాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఏడాదిన్నర దాటినా ఆశాలకు వేతనాలు పెంచకపోవడం దుర్మార్గమని విమర్శించారు. తమకు వైద్యశాఖ ఉద్యోగస్తులకు వర్తించే విధంగా వేతనాలతో కూడిన సెలవు దినాలు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న లెప్రసీ, టీబీ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు దివ్య భారతి, నాయకులు గౌరీ, బ్యూల, శ్రీదేవి, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ చట్టాలపై సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి


పుత్తూరు: చట్టాలు, నిబంధనలను అర్థం చేసుకోవడానికి సర్టిఫికెట్ కోర్సులు దోహదం చేస్తాయని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. సోమవారం కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) చట్టాలపై 40 రోజుల సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించి ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఆధునిక ప్రపంచంలో ఉత్పత్తి, సేవా రంగా లలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు, వారి కెరీర్‌కు ఈ సర్టిఫికెట్ కోర్సు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ తిరుమ లయ్య, కామర్స్ విభాగ అధిపతి వాసవి, అధ్యాపకులు గంగయ్య, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై శిక్షణ ప్రారంభం


అవగాహనపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కార్వేటినగరం: విద్యార్థులు వృత్తి నైపుణ్యాలపై కూడా అవగాహన పెంచుకోవడం ముఖ్యమని కత్తెరపల్లె ఉన్నత పాఠశాల హెచ్ఎం చెంగల్రాజు అన్నారు. సోమవారం కత్తెరపల్లె హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు వృత్తి విద్యపై 10 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గ్రామీణ బ్యాంకు క్రెడిట్ ఆఫీసర్ జాషువా ఆధ్వర్యంలో హెచ్ఎం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఐటీ–ఐటీఎస్, బీఎస్ఎఫ్ఐ ట్రేడ్‌లలో ఒక్కో ట్రేడ్‌కు 15 మంది చొప్పున 30 శిక్షణ ఇస్తామన్నారు. జాషువా మాట్లాడుతూ, విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకున్నా అందులో పూర్తి స్థాయిలో రాణించేందుకు కృషి చేయాలని, ఇలాంటి శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే జీవితంలో స్థిరపడగలరన్నారు. తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీచర్లు సర్దార్, వెంకటేశులు, ఫయాజ్, రూప, బాలసుబ్రమణ్యం, వృత్తి విద్యా శిక్షకులు హరికృష్ణ, ప్రవీణ్, స్కూల్ జూనియర్ సహాయకులు హరిప్రకాష్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వరూ!


మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వీధి విక్రయదారులు

పుత్తూరు: తమ సమస్యలు పరిష్కరించాలని, వ్యాపార స్థలాలపై మార్కింగ్ చేయాలని డిమాండ్ చేస్తూ వీధి విక్రయదారులు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆందోళనకు నేతృత్వం వహించిన సమాచారం హక్కుల వేదిక సంఘ కార్యదర్శి కె.మురగారెడ్డి మాట్లాడుతూ, 2025–26 గెజిట్ ప్రకారం వీధి విక్రయదారుల నుంచి రోజువారీ రుసుం వసూలు చేయాలని, భారత ప్రభుత్వ 2014 గెజిట్ చట్టాన్ని అమలు చేయాలని, వీధి విక్రయదారుల సంఘాలను ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కమిషనర్ మంజునాథ్‌గౌడ్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో హేమలత, నవీన్, గోపాల్, కాశి, తిరుపాల్, అజయ్, అంకయ్య, రాణెమ్మ, అములు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయరూ!

వెదురుకుప్పం: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి రెడ్డి సంఘం నేతలు వినతి పత్రం సమర్పించారు. సంఘం నేతలు మాట్లాడుతూ, గత ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఇంత వరకూ రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. రెడ్లలో కూడా పేదలు ఉన్నారని, వారి ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం చొరవ చూపాలని, కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 2 వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, రాయితీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్నం సురేంద్రరెడ్డి, యువజన సంఘం రాష్ట్ర బండి దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కామసాని దేవరాజులురెడ్డి, జీడీ నెల్లూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు ఎస్. ధనంజయరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ లోకనాథరెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

పుత్తూరు: తన భార్య (28) ఈనెల 19వ తేదీ నుంచి కనిపించడం లేదని పుత్తూరు పట్టణ పరిధిలోని నెత్తం దళితవాడకు చెందిన వ్యక్తి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు.. రేణిగుంట సమీపంలోని ఓ కంపెనీలో కార్మికురాలిగా పనిచేస్తున్న మహిళ ప్రతిరోజూ ఉదయం పనికి వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వచ్చేది. ఈనెల 19వ తేదీన పనికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. భర్త గత రెండు రోజులుగా పలుచోట్ల గాలించినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలతోనే శక్తివంతమైన సమాజం

కార్వేటినగరం: మహిళలు ఆరోగ్యంగా ఉంటే శక్తివంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కత్తెరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ హేమశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని గోపిశెట్టిపల్లె ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. వివిధ రుగ్మతలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తహీనత నివారణ..ఇత్యాది వాటిపై అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్యాధికారిణి ఎస్.దీపిక మాట్లాడుతూ, రోగాల నివారణకు ఆయుర్వేద మందులు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎం.కొత్తూరులో..

నగరి: మండలంలోని ఎం.కొత్తూరు సచివాలయ ఆవరణలో 'స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్' ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. మండల వైద్యాధికారులు, వైద్య నిపుణులు 191 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవగాహన సమావేశంలో వైద్యాధికారి డా.మోహనరూప మాట్లాడారు. స్వస్థ నారీ సశక్తి పరివార్ ఉద్దేశాలను, ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య పరీక్షలు, సదుపాయాలను, ఎన్సీడీ స్క్రీనింగ్, క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పించారు. పీహెచ్ఎన్ అమరావతి, ఎంపీహెచ్ఎస్ సుశీలమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.




కార్వేటినగరం: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి డాక్టర్ హేమశ్రీ, నగరి: మహిళకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్